సాక్షి కామారెడ్డి

సోమవారం, 25, సెప్టెంబర్, 2023



ర్యాలీకి తరలిరండి

జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించే ధర్మయుద్ధం ర్యాలీకి తరలిరావాలని ముదిరాజ్ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

- 9లో ▸



ఉద్యోగం వదిలేశా

జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చానని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /22.5

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీపతి



కామారెడ్డి రూరల్: జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కామారెడ్డి(దేవునిపల్లి)కి చెందిన లద్దూరి లక్ష్మీపతి యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కామారెడ్డిలో ఆదివారం రేషన్ డీలర్లు సమావేశమై అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గాన్ని రెండు రోజుల్లో ఎన్నుకోనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గొరిశెట్టి రాజు, ప్రతినిధులు నాగం సురేందర్, జనార్దన్‌రెడ్డి, నాగరాజు, రమేష్ గౌడ్, సింగ్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘బదిలీల ఘనత పీఆర్‌టీయూదే’



నిజామాబాద్‌అర్బన్ : టీచర్ల బదిలీలు, పదోన్నతుల ఘనత పీఆర్‌టీయూదేనని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నో కోర్టు కేసులు ఉన్నా.. వాటిని అధిగమించి ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ ప్రక్రియ జరిపిస్తున్నట్లు చెప్పారు. బదిలీల తర్వాత మిగిలిన ఖాళీలను స్పౌజ్ టీచర్ల బదిలీలతో భర్తీ చేయిస్తామన్నారు. సమస్య ఏదైనా పరిష్కారం కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. సమస్యలు చెబితే చందాలు వసూలు చేసే వారి మాయాలో పడొద్దన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగాయన్నారు. అనంతరం పీఆర్‌టీయూ నాయకులు జెడ్పీ చైర్మన్‌ను సన్మానించారు.

ఎస్సారెస్పీ 16 గేట్ల ఎత్తివేత

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఆదివారం రాత్రి వరద పోటెత్తింది. దీంతో అధికారులు 16 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 50 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. ఉదయం 25వేల క్యూసెక్కులు వచ్చిన వరద నీరు సాయంత్రానికి 22 వేల క్యూసెక్కులకు తగ్గింది. మళ్లీ రాత్రికి 35 వేల క్యూసెక్కులకు పెరిగి ఒక్కసారిగా 65వేల క్యూసెక్కులకు చేరింది. ఎగువ నుంచి మరింత వరద నీరు పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 15వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3 వేలు, సరస్వతి కాలువ ద్వారా 300, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 540, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతోంది.

మంత్రి హరీశ్‌రావును కలిసిన వైద్యులు



నిజామాబాద్ నాగారం : తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యులు రాష్ట్ర వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పీఆర్‌సీ బకాయిలు, ప్రొఫెసర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల చేసినందుకు అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అన్వర్, జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు కిరణ్ మాదల, కిరణ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

రేపు భారత జాగృతి ఉపన్యాస పోటీలు

కామారెడ్డి అర్బన్: సదాశివనగర్ మండలంలోని మర్కల్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 11 గంటలకు ‘చట్టసభల్లో మహిళల పాత్ర.. 33 శాతం రిజర్వేషన్ల ప్రభావం’ అన్న అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు చిట్టిమల్ల అనంతరాములు, జిల్లా మహిళా కన్వీనర్ బట్టు పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు నేరుగా ఉపన్యాస పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఇద్దరికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.



నిధుల వరద..

- కామారెడ్డి నియోజకవర్గంపై సర్కార్ ఫోకస్
- అభివృద్ధి పనులకు భారీగా నిధులు
- ఆలయాలతోపాటు కుల సంఘాలకూ కేటాయింపు
- నెల రోజుల్లో రూ. 275 కోట్లు మంజూరు

వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న నేపథ్యంలో ఈ ప్రాంత అభివృద్ధిపై సర్కార్ ఫోకస్ చేసింది. ఇప్పటికే నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.275 కోట్లు మంజూరు చేసింది. పనులను కూడా త్వరితగతిన చేపట్టి, పూర్తి చేయాలని భావిస్తోంది.

సాక్షి, కామారెడ్డి: బీఆర్‌ఎస్ పార్టీ గత నెల 21న అభ్యర్థుల జాబితా ప్రకటించింది. కామారెడ్డి నుంచి తానే పోటీ చేస్తానని సీఎం కేసీఆర్ వెల్లడించారు. దీంతో అందరి దృష్టి కామారెడ్డి నియోజకవర్గంపై కేంద్రీకృతమైంది. మరోవైపు సీఎం కేసీఆర్ పోటీ చేయనుండడంతో ప్రభుత్వం నియోజకవర్గానికి భారీ ఎత్తున నిధులు విడుదల చేసి, అభివృద్ధి పరుగులు తీసేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను సీఎం కేసీఆర్ పలుమార్లు పిలిపించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిపాదనలు తీసుకున్నారు. దీంతో నిధుల వరద మొదలైంది. నెల వ్యవధిలోనే కామారెడ్డి నియోజకవర్గానికి రూ.275 కోట్లు మంజూరు చేశారు. సీఎం పోటీ చేస్తుండడంతో బీఆర్‌ఎస్ నాయకత్వం కుల సంఘాలపై ఫోకస్ చేసింది. భారీ ఎత్తున నిధులు కేటాయించడం ద్వారా తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. అలాగే ఆలయాల అభివృద్ధికి నిధులు ఇవ్వడం ద్వారా భక్తుల మద్దతు కూరగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు రూ.195 కోట్లు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి కామారెడ్డి ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడం కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పగిలిపోయి తరచూ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో కొత్త పైపులైన్ ఏర్పాటు కోసం రూ.195 కోట్లు మంజూరు చేశారు. దీంతో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పలు మండలాలకు తాగునీటిని సరఫరా చేయడానికి తలెత్తుతున్న ఇబ్బందులు తొలగిపోతాయని భావిస్తున్నారు.

కుల సంఘాలకు రూ.25 కోట్లు..

నియోజకవర్గంలోని ఆయా గ్రామాలు, పట్టణాల్లో కుల సంఘ భవనాలు, ఆలయాల అభివృద్ధి కోసం తొలుత ఎస్‌డీఎఫ్ నుంచి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. తర్వాత మరో రూ.10 కోట్లు మంజూరు చేశారు. రూ.25 కోట్లతో నియోజక వర్గంలోని ఆయా గ్రామాల్లో కుల సంఘాలకు ప్రొసీడింగ్స్‌ను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేతుల మీదుగా అందజేశారు.

ఆలయాల అభివృద్ధికి రూ.10 కోట్లు..

నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి కోసం ఎస్‌డీఎఫ్‌నుంచి రూ.10 కోట్లు మంజూరు చేశారు. ఇందులో భిక్కనూరులోని సిద్దరామేశ్వరాలయానికి రూ.2 కోట్లు, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి రూ. కోటి కేటాయించారు. అలాగే నియోజకవర్గంలో 160 ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. దీంతో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆలయాలు పునర్నిర్మాణానికి, అభివృద్ధికి నోచుకుంటాయని భావిస్తున్నారు.

పట్టణ అభివృద్ధికి రూ.45 కోట్లు..

కామారెడ్డి పట్టణంలో అంతర్గత రోడ్లతో పాటు ఇతర అభివృద్ధి పనుల కోసం ఎస్‌డీఎఫ్, టుఫిడ్కో నుంచి రూ.45 కోట్లు మంజూరయ్యాయి. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 కోట్లతో పట్టణంలో రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. టుఫిడ్కో నుంచి మంజూరైన రూ.20 కోట్లతో స్టేడియంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

అంతటా అదే చర్చ..

సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రకటన వెలువడిన తర్వాత నియోజకవర్గానికి నిధుల వరద పారుతుండడంతో అంతటా ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. నెలలోనే రూ. 275 కోట్లు మంజూరవడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు మరిన్ని నిధులు మంజూరవుతాయని భావిస్తున్నారు. ప్రధానంగా సాగునీటికి సంబంధించి కాళేశ్వరం 22 వ ప్యాకేజీ పనులు, భీమేశ్వర ప్రాజెక్టును చేపట్టడం వంటి వాటికి పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఇదే సమయంలో కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుతో పాటు ఇతర సాంకేతిక కళాశాలలు కూడా ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎన్నికలకు సన్నద్ధం!

- ఏర్పాట్లలో యంత్రాంగం బిజీబిజీ
- గత అనుభవాలను సమీక్షించుకుంటూ ముందుకు..



సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం పనులను ముమ్మరం చేసింది. త్వరలో షెడ్యూల్ వెలువడనుందన్న సంకేతాలతో చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా అధికారులు సన్నద్ధం అయ్యారు. ఇప్పటికే జిల్లాలో పోలింగ్ కేంద్రాలను గుర్తించే ప్రక్రియను పూర్తి చేశారు. 790 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఓటరు నమోదు ప్రక్రియ పూర్తవ్వగా తుది జాబితాల తయారీ పని సాగుతోంది. మరోవైపు రాజకీయ పార్టీలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన బ్యాంకు లావాదేవీలు, మద్యం అమ్మకాలకు సంబంధించిన డేటా సేకరించారు. అలాగే గత ఆరు నెలల్లో జరిగిన బ్యాంకు లావాదేవీలు, మద్యం అమ్మకాల వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో ఎన్నికల విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గత ఎన్నికల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వచ్చే ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. గత ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు, నేరాలు, కేసుల వివరాలను సేకరిస్తున్నారు. షెడ్యూల్ వెలువడిన మరుక్షణం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి రానున్న నేపథ్యంలో ముందుగా అప్రమత్తమై నియామళికి సంబంధించిన విధివిధానాలపై చర్చిస్తున్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్న లక్ష్యంతో జిల్లా యంత్రాంగం విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలను అప్రమత్తం చేశారు.

షెడ్యూల్‌కు ముందే..

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధం అవుతోంది. ఇప్పటికే అన్ని ప్రక్రియలు పూర్తి చేసింది. రెవెన్యూ, పోలీసు అధికారుల బదిలీల ప్రక్రియను మొదట్లోనే పూర్తి చేసింది. తర్వాత ముసాయిదా జాబితాల ప్రదర్శన, ఓటరు నమోదు కార్యక్రమాలు చేపట్టింది. పోలింగ్ కేంద్రాలను రెడీ చేసింది. జిల్లాలో ఉద్యోగులు, అధికారుల వివరాలన్నింటినీ సేకరించారు. ఎన్నికలకు సంబంధించి అనుభవం ఉన్న వారికి వివిధ బాధ్యతలు అప్పగించారు. కొత్తవారికి అవగాహన కల్పిస్తున్నారు. షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ఎక్కడా వెనకబడకుండా ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

‘సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి’

నిజాంసాగర్: ఎన్నికలకు ముందుగానే గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు సూచించారు. ఆదివారం ఆయన నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా స్థానిక పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకున్న పోలీసులు స్థానికులతో మమేకమవ్వాలన్నారు. నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు, ప్రమాదాలు లేవంటూ సీఐ, ఎస్సైల పనితీరును మెచ్చుకున్నారు. ఆయన వెంట బాన్సువాడ రూరల్ సీఐ మురళి, ఎస్సై రాజశేఖర్ తదితరులున్నారు.



నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

అనారోగ్యంతో రిమాండ్ ఖైదీ మృతి

- కల్తీ కల్లు దొరక్క..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత



మృతుడు యూసుఫ్(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆర్థిక కారణాలతో సొంత అక్కపై కత్తితో దాడిచేసి హత్య చేసిన వ్యక్తి.. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో మరణించాడు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 12న రాత్రి 10 గంటల ప్రాంతంలో మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో రుక్సానా అనే మహిళను ఆమె తమ్ముడు షేక్ యూసుఫ్(34) హత్య చేశాడు. అతడిని మాచారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి 14 వ తేదీన కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో కామారెడ్డి సబ్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలులో ఉంటున్న యూసుఫ్.. శారీరక, మానసిక ఒత్తిడికి గురై ఈనెల 22న తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో జైలు అధికారులు అతడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం యూసుఫ్ మరణించాడని కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు. నిబంధనల ప్రకారం కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పంచనామా నిర్వహించామన్నారు. నివేదిక, జైలు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. యూసుఫ్ అనారోగ్యానికి గురి కావడానికి ప్రధాన కారణం కల్తీ కల్లుకు అలవాటు పడడమే అని తెలుస్తోంది. జైలులో మత్తు పదార్థాలు దొరక్కపోవడంతోనే అతడు ఆస్పత్రి పాలైనట్లు పోలీసులు సైతం చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం రిమాండ్ ఖైదీగా ఉన్న కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన భూమన్నగారి నర్సింలు (40) అనే వ్యక్తి సైతం ఇదే తరహాలో అనారోగ్యం పాలై మృతి చెందాడు. వరుసగా రిమాండ్ ఖైదీలు మృతి చెందడం ఆందోళనకు గురిచేస్తోంది.

‘అందరి సంక్షేమానికి కృషి చేస్తున్నా’



బాన్సువాడలో ర్యాలీ తీస్తున్న ముదిరాజ్‌లు

బాన్సువాడ: నియోజకవర్గంలో అందరి సంక్షేమానికి కృషి చేస్తున్నానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడ బీడీ వర్కర్స్ కాలనీలో రూ. 25 లక్షలతో చేపట్టిన ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాలు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం కొయ్యగుట్ట పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని కుల సంఘాలకు భవనాలు, కల్యాణ మండపాలను నిర్మించామన్నారు. కొత్త బాన్సువాడ ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణం, పెదమ్మ తల్లి గుడి నిర్మాణం కోసం రూ. 50 లక్షలు నిధులు కేటాయిస్తున్నామన్నారు. ముందుగా స్పీకర్ నివాసం నుంచి బీడీ వర్కర్స్ కాలనీ వరకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. తెలంగాణ అమరవీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ చౌరస్తాలో స్పీకర్‌తోపాటు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలను గజమాలతో సత్కరించారు.

అన్ని మతాలను సమానంగా చూస్తున్నాం

ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు అన్ని మతాలకు సమానంగా పంచుతున్నామని స్పీకర్ పేర్కొన్నారు. బాన్సువాడలో రూ.52 లక్షలతో నిర్మించిన సీఎస్ఐ చర్చిని ఆయన ప్రారంభించారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో ఆలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. తనకు మద్దతు తెలిపినందుకు క్రైస్తవులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, ఆర్డీవో భుజంగరావు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు బట్టు విఠల్, గురువినయ్, ఉప్పరి లింగం, గడుమల లింగం, రఘురామయ్య, కనుకుట్ల రాజు, మామిళ్ల రాజు, భాస్కర్, గులెపల్లి అనిత, ఉప్పరి సాయిలు, పోగు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఫంక్షన్ హాల్‌కు భూమిపూజ చేస్తున్న స్పీకర్

‘కోనేరు పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చాలి’



కోనేరును పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భిక్కనూరు: దక్షిణకాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయం ప్రాంగణంలో పునర్నిర్మిస్తున్న కోనేరుతో పాటు పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆదివారం ఆయన ఆలయ కోనేరు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కోనేరు పునర్నిర్మాణ పనులు బాగున్నాయన్నారు. ఆలయానికి వెళ్లే దారికి ఇరువైపులా మొక్కలను నాటాలని, కోనేరు ప్రాంతంలో రంగురంగుల పూల మొక్కలను నాటాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో గోపాల్‌రావు, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్, డైరెక్టర్ తాటికొండ బాబు తదితరులున్నారు.

రక్తదాతల సేవలు అభినందనీయం



రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో రక్తదాతల సమూహం అధ్వర్యంలో 15 ఏళ్లుగా సేవలందిస్తుండడం అభినందనీయమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలుమార్లు రక్తదానం చేసినవారికి కలెక్టర్ ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంతో పాటు ప్లాస్మాదానంపైన అవగాహన సదస్సులను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని సమాజంలోని యువత రక్తదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రక్తదాతల సమూహం సమన్వయకర్త బాలు, అధ్యక్షుడు వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్, కిరణ్, సలహాదారులు రమణ, సాయి, శ్రీధర్, రక్తదాతలు పాల్గొన్నారు.

‘కేసీఆర్ పతనం ఖాయం’

మాచారెడ్డి: సీఎం కేసీఆర్ పతనం కామారెడ్డి నుంచే మొదలవుతుందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ జోస్యం చెప్పారు. ఆదివారం ఆయన పాల్వంచ, ఇసాయిపేటలలో గడపగడపకు షబ్బీర్ అలీ కార్యక్రమం నిర్వహించారు. పలువురు మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. గజ్వేల్‌లో చేతగాని కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేయడానికి వస్తున్నారని విమర్శించారు. ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నచందంగా సీఎం కేసీఆర్, గంప గోవర్ధన్‌ల రాజకీయ జీవితం కామారెడ్డిలో ముగుస్తుందన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నేతలు వాటిని అమ్ముకోవడానికి యత్నిస్తున్నారని షబ్బీర్ అలీ ఆరోపించారు. పిట్టల దొర కేసీఆర్‌ను నమ్ముకుంటే నట్టేట ముంచుతాడన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి, కాంగ్రెస్ నాయకులు గణేష్ నాయక్, ముకుందం, రవిప్రసాద్, నొసిలాల్, సుధాకర్‌రెడ్డి, రవిగౌడ్, శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



భిక్కనూరు: జంగంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద మహిళ లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ ఆదివారం ఎల్‌వోసీ అందజేశారు. లక్ష్మి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు పరీక్షించి వైద్యానికి అవసరమైన రూ.లక్ష కావాలని కోరగా ఆమె నిరుపేద అవడంతో ఈ విషయాన్ని స్థానిక బీఆర్‌ఎస్‌ నేతలు ప్రభుత్వ విప్‌ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్‌, డీసీసీబీ డైరెక్టర్‌ గొండ్ల సిద్ధరాములు ఉన్నారు.

స్పీకర్‌కు మద్దతు తెలిపిన ఇబ్రహీంపేట్‌ గ్రామస్తులు

బాన్సువాడ రూరల్‌: ఇబ్రహీంపేట్‌ గ్రామానికి చెందిన ముస్లింలు ఆదివారం స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. మైనార్టీ విద్యార్థులకు గురుకుల పాఠశాలలు, పేదింటి ఆడబిడ్డల పెళ్లికి షాదీముబారక్‌, స్వయం ఉపాధి కోసం మైనార్టీ బంధు లాంటి పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లోనూ తమ మద్దతుగా ఉంటామని లేఖను అందజేశారు. డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌ నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

కురుమలకు గొర్రెలు పంపిణీ చేయాలి



కామారెడ్డి టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కురుమలకు గొర్రెలను పంపిణీ చేయాలని కురుమ చైతన్య సమితి జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్‌ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు చెట్టుకూరి రజినీకాంత్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గొర్రెల పెంపకందారులందరికీ బీమా పథకాన్ని అమలు చేసి పింఛన్‌ అందించాలని కోరారు. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అంబల్ల సాయి నిఖిల్‌, కో–ఆర్డినేటర్‌ జీవీఎం విఠల్‌, ఉపాధ్యక్షుడు గంగాధర్‌ పాల్గొన్నారు.

మిలాన్‌ ఉన్‌ నబీ సందర్భంగా రక్తదాన శిబిరం



కామారెడ్డి టౌన్‌: మిలాద్‌ ఉన్‌ నబీ, మహమ్మద్‌ ప్రవక్త జన్మదినం సందర్భంగా మర్కజీ మిలాద్‌ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మదీనా మజీద్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మహమ్మద్‌ అలీ షబ్బీర్‌ హాజరై మాట్లాడారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో వినాయక నిమజ్జనం, మిలాద్‌ ఉన్‌ నబీ మహమ్మద్‌ ప్రవక్త పుట్టినరోజు ఒకేరోజు రావడంతో పట్టణంలో మిలాద్‌ ఉన్‌ నబీ ర్యాలీని రద్దు చేసుకుని రక్తదానం శిబిరం నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరు ఎదుటి మతాల వారిని గౌరవించి మత సామరస్యం పాటించడం అభినందనీయమన్నారు. 70 మంది రక్తదానం చేశారు. వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. డాక్టర్లు వెంకటేశ్వర్‌ గౌడ్‌, శ్రీనివాస్‌ గౌడ్‌, డీసీసీ అధ్యక్షుడు కైలాస్‌ శ్రీనివాసరావు, నేతలు కాసుల బాలరాజ్‌, అన్వర్‌ అహ్మద్‌, పాక రవి, ఖదీర్‌ పాల్గొన్నారు.

సెల్ఫీ విత్‌ గణేశ్‌..



పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్‌ కమ్యూనిటీ, యువ జన సంఘాల మండ పాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల కు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్‌ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్‌ నం..
96039 39111



సంపత్‌, సందీప్‌, సంతోష్‌, నారాయణ, కామారెడ్డి



చండీ మంత్రాలయం, కామారెడ్డి



నితీష్‌, కామారెడ్డి



మాసుల శ్రీ నిత్య, నిహాల్‌, కామారెడ్డి



చింతల రాజేష్‌, దోమకొండ



శ్యాం, అమిత, కామారెడ్డి



సాయిసుధ, కామారెడ్డి



గణేశ్‌, సాగర్‌, గాంధారి



ఆరుష్‌, ఆద్య, కామారెడ్డి



నందు, సిద్ధు, భిక్కనూరు



పోచయ్య, లింగంపేట



కాసం రాజు, కిరణ్‌, భరత్‌, చిన్నమల్లారెడ్డి



పద్మశాలి సంఘం, ఎల్లారెడ్డి



తిప్పారపు చిరంజీవి, చిన్నమల్లారెడ్డి



పద్మప్రియా యువజన సంఘం, కామారెడ్డి



మచ్చ కొండల్‌రావు, బాన్సువాడ



నర్సింలు, రాజంపేట



రేఖా కృష్ణమూర్తి, దోమకొండ



మట్టమల్ల సాయి, కామారెడ్డి

ఉద్యోగ భద్రత కల్పించే వరకు నిరసనలు ఆపం



లింగంపేటలో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



బీబీపేటలో..



ఎల్లారెడ్డిలో..



నస్రుల్లాబాద్‌లో బతుకమ్మను ఊరేగిస్తూ ..

సాక్షినెట్‌వర్క్‌: తమకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు నిరసనలు ఆపబోమని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ ఆడి తమ నిరసనలు తెలియజేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్‌, ఈఎస్‌ఐ, రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ కల్పించాలన్నారు. ఐదు లక్షల ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. పలువురు సంఘీభావం తెలిపారు.

గూడు కట్టించారు.. గుండెల్లో పెట్టుకుంటాం



మాట్లాడుతున్న స్పీకర్‌ పోచారం



హాజరైన డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులు

బాన్సువాడ రూరల్‌: కిరాయి ఇళ్లలో ఉండే మాకు రూపాయి ఖర్చులేకుండా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇచ్చిన మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటామని కేసీఆర్‌–పీఎస్‌ఆర్‌ కాలనీవాసులు స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి కాలనీలో ఆత్మీయ సమ్మేళన సమావేశం ఏర్పాటు చేసి పోచారం శ్రీనివాస్‌ రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా స్పీకర్‌ పోచారం మాట్లాడుతూ.. కాలనీలో 1,004 డబుల్‌బెడ్‌ రూం ఇళ్లు ఉన్నాయని, సుమారు 4 వేల మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. కాలనీలో మంచి నీటి పైప్‌లైన్‌తో పాటు సీసీరోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్‌, స్కూల్‌, ఫంక్షన్‌ హాల్‌ ఏర్పాటు చేశానని భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మున్సిపల్‌ చైర్మన్‌ జంగం గంగాధర్‌, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్‌ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

కామారెడ్డి క్రైం: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని దేవునిపల్లి ఎస్సై రాజు సూచించారు. ఆదివారం దేవునిపల్లిలో యువజన సంఘాల ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా సోదరభావంతో మెలగాలన్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా పండుగలు జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా డీజేలకు అనుమతి లేదన్నారు. పోలీస్‌ సిబ్బంది, కౌన్సిలర్లు పోలీస్‌ క్రిష్టాజీరావు, కాసర్ల గోదావరిస్వామి, ఉరుదొండ వనిత, వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సెంట్రల్‌ లైటింగ్‌ పనులపై గ్రామ సభ



నిజాంసాగర్‌(జుక్కల్‌): సెంట్రల్‌ లైటింగ్‌ పనుల నిర్వహణపై ఆదివారం మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. సెంట్రల్‌ లైటింగ్‌, రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే రోడ్డు విస్తరణ 50 ఫీట్ల చొప్పున చేపట్టాలని కొందరు ప్రతిపాదించారు. మరికొందరు 30 ఫీట్ల లోపు చేయాలని గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారని పంచాయతీ కార్యదర్శి గంగారాం తెలిపారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ఆదేశాలనుసారంగా సెంట్రల్‌ లైటింగ్‌ పనులకు అనుమతించాలని స్థానికులు పంచాయతీ వారిని కోరుతున్నారు.

అవినీతి ప్రభుత్వాలను తరిమేద్దాం

- గోవా పీసీసీ అధ్యక్షుడు అమిత్‌ పాట్కర్‌



మాట్లాడుతున్న అమిత్‌ పాట్కర్‌

బిచ్కుంద(జుక్కల్‌): కేంద్రం, రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి ప్రభుత్వాలను పాలద్రోలుదామని కాంగ్రెస్‌ నియోజకవర్గ పర్యవేక్షకుడు, గోవా పీసీసీ అధ్యక్షుడు అమిత్‌ పాట్కర్‌అన్నారు. బిచ్కుందలో మాజీ ఎమ్మెల్యే గంగారాం అధ్యక్షతన కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అధిక ధరలతో ప్రజల రక్తాన్ని తాగి దేశాన్ని భ్రష్టుపట్టించారని అన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందన్నారు. జుక్కల్‌లో మూడు సార్లు గెలుపొందిన స్థానిక ఎమ్మెల్యేగా ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి 2004 ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రైతులకు రుణమాఫీ, ఉచిత కరెంటు ఇవ్వడం జరిగిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇచ్చిన మ్యానిఫెస్టో ప్రకారం అన్ని హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్‌ సభ్యుడు విఠల్‌రెడ్డి, రాష్ట్ర యూత్‌ ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్‌, జిల్లా యూత్‌ అధ్యక్షుడు గజ్జు పటేల్‌, సీనియర్‌ నాయకులు మల్లికార్జునప్ప శెట్కార్‌, నాగ్‌నాథ్‌, ఖలీంపటేల్‌, గౌస్‌, గంగాధర్‌, దాదారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి అర్బన్‌: మున్నూరుకాపు ఉద్యోగులు ఐక్యంగా ఉండి విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన మున్నూరుకాపులకు సహకారం అందించాలని తెలంగాణ మున్నూరుకాపు ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బాల శ్రీనివాస్‌పటేల్‌ అన్నారు. పట్టణ పరిధిలోని దేవునిపల్లి మున్నూరుకాపు సంఘంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లాలో డివిజన్ల వారిగా కమిటీలు ఏర్పాటు చేసి అసోసియేషన్‌ను విస్తరించాలని సూచించారు. అనంతరం అసోసియేషన్‌ జిల్లాశాఖ తాత్కాలిక కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీలం రాజులు, గౌరవ అధ్యక్షుడిగా సుదర్శనం రాములు, అసోసియేట్‌ అధ్యక్షులుగా సోమన్నగారి బాల్‌కిషన్‌, మధుకృష్ణ, ఆముదాల భానుశంకర్‌, ఉపాధ్యక్షులుగా ఆకుల కిష్టయ్య, టి.హన్మాండ్లు, ఎం.దేవేందర్‌, ముదాం శ్రీధర్‌, పటేల్‌ అనిల్‌, సంగెం సతీశ్‌, గుర్రం నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా బండిగారి విజయ్‌, కోశాధికారిగా తిపిరిశెట్టి లింగారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సంగెం శ్రీనివాస్‌, సోంశెట్టి రాము, నాగం చిరంజీవులు, సలహాదారులుగా సుతారి అంజయ్య, కార్యవర్గసభ్యులుగా ముదాం మహేశ్‌, యెంబరి లింగం ఎన్నికయ్యారు.

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



కామారెడ్డి టౌన్‌: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌ యాదవ్‌, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్‌ విగ్రహం ముందు నిరసన తెలిపారు. గ్రూప్‌–1 రెండోసారి కూడా రద్దు కావడం చాలా దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లనే ఈ దుస్థితి నెలకొందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

క్రైం కార్నర్‌

విద్యుదాఘాతంతో రైతు మృతి



బాల్‌రెడ్డి (ఫైల్‌)

భిక్కనూరు: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తిప్పాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి (49) తన పంటలో బోరు మోటారు ఆన్‌ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జేఎల్‌ఎంకు తీవ్రగాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన జేఎల్‌ఎం పిల్లి రాజయ్యకు విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. అయ్యపల్లి శివారులోని 11 కేవీ విద్యుత్‌ స్తంభంపై తీగలు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురైనట్లు పేర్కొన్నారు. స్థానికులు వెంటనే రాజయ్యను కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

కోతుల దాడిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం రాత్రి కోతుల దాడిలో బుజ్జాగౌడ్‌ అనే వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. బుజ్జాగౌడ్‌ ఎల్లమ్మ ఆలయం వద్ద వాకింగ్‌ చేస్తుండగా నాలుగు కోతులు దాడిచేసి గాయపర్చాయి. దీంతో బాధితుడిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతులతో పాటు కుక్కల బెడద తీవ్రంగా ఉందని రోడ్లపై నడవాలంటే భయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దర్యాపూర్‌లో పిడుగు



పిడుగు పడిన ప్రాంతంలో వెలువడుతున్న పొగ

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్‌ కాలనీలో ఆదివారం సాయంత్రం పిడుగు పడింది. 15 రోజుల క్రితం ఇదే ప్రాంతంలో పిడుగు పడింది. తాజాగా 60 మీటర్ల దూరంలో మరో పిడుగు పడగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కురుస్తున్న అకాల వర్షాలతో పాటు ఒకే ప్రాంతంలో పడుతున్న పిడుగులతో కాలనీవాసులు భయపడుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు జంకుతున్నారు. పిడుగు పడిన ప్రదేశంలో దట్టమైన పొగ రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు.

గాయత్రీనగర్‌లో దొంగల హల్‌చల్‌



బంగారం చోరీ చేసిన బీరువా

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి, గాయత్రీనగర్‌లో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్‌ చేశారు. తాళం వేసిన మూడు ఇళ్లల్లోకి చొరబడి బంగారం, నగదు అపహరించారు. కాలనీకి చెందిన చిట్టోజి నాగరాజు కుటుంబం శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి బంధువుల శుభకార్యానికి నార్సింగ్‌కు వెళ్లారు. గమనించిన దుండగులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 4.9 తులాల బంగారం, ఆభరణాలు, నగదు దొంగిలించారు. అదే కాలనీలోని బండ్ల శ్రీకాంత్‌, సతీశ్‌ కుమార్‌ల ఇండ్ల తాళాలను పగులగొట్టి చోరీకి యత్నించారు. ఆదివారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిందితుల పట్టివేత

బాన్సువాడ: నియోజవర్గంలో ఆరు నెలలుగా బైకులను చోరీకి పాల్పడుతున్న నిందితులను పట్టుకున్నట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టగా ముగ్గురు నిందితుల వద్ద సరైన వాహన పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణలో నస్రుల్లాబాద్‌కు చెందిన ఉల్లెంగ ప్రవీణ్‌, మైలారం గ్రామానికి చెందిన ఒడ్ల శేఖర్‌, పొతంగల్‌కు చెందిన కదల గంగాధర్‌లు కలిసి పలు చోట్ల రూ.7లక్షల విలువైన 10 బైక్‌లను దొంగిలించినట్లు నిందితులు ఒప్పుకున్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్సై పి. మశ్రీందర్‌రెడ్డి, సిబ్బంది చంద్రయ్య, రాములు, సాయికుమార్‌ ను అభినందించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చేపల చెరువులో గల్లంతైన మృతదేహం ఆదివారం లభ్యమైన ఘటన మండలంలోని గోపాల్‌పేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజేశ్‌ స్నేహితుడు లక్ష్మీనారాయణతో కలిసి గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు శుక్రవారం వెళ్లారు. చెరువులో ప్రమాదవశాత్తు రాజేశ్‌ మునిగిపోయాడు. గమనించిన లక్ష్మీనారాయణ స్థానికుల సహాయంతో వెతికినా మృతదేహం లభించలేదు. మృతదేహం ఆదివారం బయటకు తేలడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రాజేశ్‌స్నేహితులు రూ. పదివేల ఆర్థికసాయం అందజేశారు.